ఎవరో అపరిచిత వ్యక్తి రెండు చేతులతో నిచ్చెన పట్టుకున్నాడు!

బాగా తెలిసిన వాడిలా చిరునవ్వుతో చూస్తుంటే... నాకు అయోమయంగా అనిపించింది.

ఒక క్షణం విస్మయంగా అతనినే చూస్తూ ఉండిపోయాను.

నిచ్చెన అతనలా పట్టుకుని ఉండగానే మెల్లగా దిగి.. బట్టలకంటిన గడ్డిపరకల్ని దులుపుకున్నాను. నిచ్చెనని గడ్డిమేటుకి ఆనించేసి... దాని మీద ఒక చేయి వేసి జారగిలబడి.. అతను నా వేపు అలాగే నవ్వు మొహంతో చూస్తున్నాడు.

ఇంటి ముందు వేపు పాలేరు వీరన్న నవారు మంచాల్ని బయట వేసి నవారు బిగిస్తున్నాడు. పెరటి వేపు గుమ్మం తలుపు లోపలకి గడియవేసి ఉంది. అంటే వెనకవీధి నుండీ రావటానికి లేదు. ఎలా వచ్చాడు..?! అర్థం కాలేదు.

బిత్తరపోయి చూస్తూ ఎలాగో మెల్లగా గొంతు పెగల్చుకుని.. "ఎ..ఎవరు నువ్వు ఎ.. ఎలా వచ్చావ్? ఇంట్లో ఎవరూ లేరు..." అన్నాను.

"ఎలా వచ్చానంటే.. సింపుల్‌గా అలా గోడ దూకేసి వచ్చాను! నేను ఎవరిని? అంటే గోడ దూకి వచ్చే వాళ్ళను 'దొంగ' అనే కదా అంటారూ..! ఇంట్లో ఎవరూ లేరని నాకు తెలుసు. మీ నాన్న రచ్చబండ దగ్గిరా.. అమ్మా, చెల్లీ పేరంటానికి.."

నేను చురుగ్గా చూసి "ఇంతకీ ఎవరు... ఏం కావాలీ?" అడిగాను.

ఎవరూ లేరని తెలిసి వచ్చానంటున్నాడు.. ఏ బాపతు మనిషై ఉంటాడు..? ఈ ఊళ్ళో ఇలా ఇంట్లోకి వచ్చి అల్లరి చేసే ధైర్యం ఎవరికీ ఉండదు.

"దొంగనే 'ఏం కావాలీ' అని అడిగేంత మంచి అమ్మాయివన్నమాట! అడిగినవన్నీ లిస్టు ప్రకారం మూట కట్టి ఇచ్చేస్తావా?" ఫక్కున నవ్వాడు.

"ఇంటి వరకూ కూడా తెచ్చి ఇస్తాను..." అనాలనిపించింది. కోపాన్ని తమాయించుకుని చిరాగ్గా చూశాను.

ఒక నిముషం తరువాత "ప్చ్.." అంటూ నిట్టూర్చాడు. "గుర్తు పడతావేమోనని ఆశపడ్డాను. సరే, ఒక చిన్న క్లూ ఇస్తాను. చిన్నప్పటి శ్రీరామచంద్రుడిని!" అన్నాడు.

నేను ఆశ్చర్యంగా చూస్తూ "చిన్నప్పటి... అంటే.. అది మీ ఇంటి పేరా..?" అనడిగాను.

మళ్ళీ పెద్దగా నవ్వాడు. "సరే.. ఈ రూటు వర్కవుట్ కాలేదు గానీ.. చిన్నప్పుడు నీకిష్టమైన వెన్న ఉండలు చేసే అత్తయ్య గుర్తుందా..?" అనడిగాడు.

అప్పుడు గుర్తుకు వచ్చింది! సత్యం మామయ్య, అరుంధతి అత్తయ్యా వాళ్ళ అబ్బాయి.. రాజు.. సమీర్ రాజు.. ఇతనా..?!" సంభ్రమంగా చూశాను.

"నువ్వు.. రాజు.. అవునా?" మొహమాటంగా మెల్లగా అన్నాను.

"జన్మ తరించింది...! వెన్నఉండలు పుణ్యమా అని గుర్తు పట్టావ్...!" అతని మొహంలోకి వెలుగొచ్చింది.

చిన్నప్పుడు చెన్నూరు వెళ్ళినప్పుడు మనమందరం వాళ్ళింటికి వెళ్తూండేవాళ్ళం. వాళ్ళింటి ముందు చాలా మంది పిల్లలు పోగయ్యే వాళ్ళు. అందరం ఏవో ఆటలు ఆడేవాళ్ళం... గుర్తుంది కదూ?

నేను అత్తయ్య పక్కన కూర్చుంటానంటే ఒప్పుకునేది కాదు. ఒడిలోనే కూర్చోబెట్టుకునేది. ఒకసారి తను పెట్టిన వెన్న ఉండలు తిని బాగున్నాయని మళ్ళీ అడిగానని.. ఇంక ఎప్పుడు నేను ఊరికి వచ్చినా అవి తప్పకుండా చేసిపెట్టేది! నోట్లో వేసుకుంటే కరిగిపోయేట్లుగా అత్తయ్య చేసే ఆ వెన్న ఉండల రుచి నాకు బాగానే గుర్తుంది!

"కాసేపటిలో నాన్న వచ్చేస్తారు..." అని చెబుతోంటే రాజు మధ్యలోనే "లేరని తెలిసేగా వచ్చాను. మళ్ళీ ఇంటికి వచ్చేసరికి వెళ్ళిపోతాలే.." అన్నాడు.

"ఎందుకలా..?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఆ గత చరిత్ర.... ఆ యుద్ధాలూ.. కారణాలూ.. అవన్నీ మనకనవసరం. నన్నిక్కడ చూస్తే మీ నాన్నకి బిపి పెరిగిపోతుందనేది మాత్రం నిజం! మా అమ్మ నిన్నొకసారి చూడాలని ఉందంటే రమ్మని చెబుదామని వచ్చాను. మామయ్య పర్మిషన్ మాత్రం నీకు దొరకదు. మా ఇల్లు నీ ఫ్రెండ్ సుందరీ వాళ్ళ పక్కనేగా.. వాళ్ళకీ మాకూ పెరటివేపు పక్క గోడకి గుమ్మం ఉంది కాబట్టి నువ్వలా రావచ్చు. ఎవరైనా చూసి ఈ న్యూస్ మీ నాన్నకి చేరవేసే అవకాశం ఉండదు.." అన్నాడు.

రాజు వాళ్ళింటికి వెళ్తానంటే నాన్న ఎందుకు అంగీకరించడు..? రాజు వాళ్ళు ఎప్పుడో వాళ్ల మామయ్య ఊరికి వెళ్లిపోయారు. ఈ మధ్య తిరిగి వచ్చారు కాబోలు. ఇంతలో ఏం గొడవలొచ్చాయో..?

"అమ్మ కోసం .. రేపు మధ్యాహ్నం వస్తావా..?" మళ్ళీ అడిగేసరికి అప్రయత్నంగా సరేనని తల వూపాను.

"అయితే.. నేను వెళ్ళొస్తా.." అని గడ్డిమేటుకి అటు పక్క పెట్టాడు కాబోలు పొడుగాటి కర్ర తీసుకొని రివ్వున గోడ దూకేశాడు!

నిజంగానే.. గోడ దూకే వచ్చాడన్నమాట! హైజంప్‌లో బాగా ప్రాక్టీసు ఉంది కాబోలు!

ఆశ్చర్యపోతూ నేనలా నిలబడి ఉండగానే మళ్ళీ అలాగే గోడ దూకి వచ్చాడు.

నాకు అర్థం కాక ఎందుకు.. ఏమిటి అని అడగబోతుండగా.. "వచ్చేటప్పుడు గోడదూకి వచ్చినా గానీ, వెళ్ళేటప్పుడు పెరటి గుమ్మం గెడ తీసుకొని వెళ్ళిపోవచ్చుగా అని ఆలోచన వచ్చి.. మళ్ళీ వచ్చాను.." అంటూ అటు వెళ్ళి గుమ్మం గెడ తీసి వెళ్ళబోతూ ఒక క్షణం ఆగి వెనక్కి చూసి తమాషాగా నవ్వాడు!

చిత్రమైన మనిషిలా ఉన్నాడే...! నవ్వుకున్నాను.

గోడ దూకటం.. విచిత్ర విన్యాసంలా అనిపించింది!

ఆ రాత్రి యాధాలాపంగా అడిగినట్లుగానే అమ్మను వాళ్ళ సంగతులు అడిగాను. "అంతా పోగొట్టుకుని ఊరు వదిలి వెళ్ళిన ఇన్ని సంవత్సరాలకు మళ్ళీ వచ్చారు. రాజు.. బాగానే చదివాడట. గానీ.. ఉద్యోగం చేయనని, వ్యవసాయమే చేస్తానన్నాడట. కౌలుకి చేస్తున్నాడని అన్నారు. ఒకప్పుడు అంత బాగా బ్రతికిన వాళ్ళకి.. ఇలాంటి పరిస్థితి వచ్చింది. అరుంధతిని పలుకరించి వద్దామంటే... నాన్న వీల్లేదన్నారు. తెలుసుగా, వద్దన్న పని చేస్తే ఎంత కోపం వస్తుందో.. అందుకే నేనూ వెళ్ళలేదు.." అని చెప్పింది. వివరంగా చెప్పలేదు. అక్కడితో సంభాషణ ఆపేసింది.

నాన్నకి అంత ఇష్టం లేనప్పుడు తెలియకుండా నేను మాత్రం వెళ్ళటం ఎందుకులే అనుకున్నాను. మర్నాడు సుందరీ వాళ్ళింటికి వెళ్ళినప్పుడు సుందరిని మా రెండు కుటుంబాల మధ్య గొడవలేం వచ్చాయని అడిగాను. "నాకేం తెలుసూ.." అంటూ మాట దాట వేయబోయింది గానీ తన మొహం చూస్తుంటే తెలుసనే అనిపించింది. చెప్పటానికి సంకోచిస్తోందనిపించి నేను రెండు మూడు సార్లు అడిగాక అప్పుడు చెప్పింది.

"పెద్దవాళ్ళు చెప్పుకునే మాటల్ని బట్టి నాకు తెలిసిన సంగతుల్ని చెబుతున్నా. మీ నాన్న, రాజు వాళ్ళ నాన్న సత్యంగారు, భద్రయ్యగారు కలిసి పండ్ల వ్యాపారం .. అంటే ఎగుమతి చేయటం మొదలు పెట్టారట. ఇంకా ఏవో కూడా ఉన్నాయట. ఒక సంవత్సరం తర్వాత మీ నాన్న తన వాటా లాభంతో సహా తీసేసుకుని వ్యాపారం నుండి తప్పుకున్నారు. ఆ తరువాత భద్రయ్య సరిగా లెక్కలు చెప్పకుండా చేసిన మోసంతో సత్యం మామయ్యకి బాగా అప్పులు పెరిగిపోయాయి. ఆస్తి అంతా అప్పుల వాళ్ళకే సరిపోయేట్లుందని అరుంధతి అత్తయ్యకు పుట్టింటి వాళ్ళిచ్చిన డబ్బుతో కొన్న పదిహేను ఎకరాల పొలమైనా మిగల్చాలని... ఆ పొలాన్ని మీ నాన్న పేర సత్యం మామయ్య రాసేశారట. మిగతా ఆస్తులన్నీ అమ్మి అప్పుల వాళ్ళకి తలా కొంతగా తీర్చేశాక, కొన్నాళ్ళ తర్వాత... మీ నాన్న పొలం సత్యం మామయ్యకి స్వాధీనపరచటానికి ఇష్టపడకుండా, నాకు రావల్సిన బాకీ కోసమే ఆ పొలం నాకు రాసిచ్చారంటూ ఎదురు తిరిగారట! అరుంధతి అత్తయ్య అన్నయ్యలు వచ్చి ఊళ్ళో నలుగురి ముందూ మీ నాన్నని తిట్టి.. 'నీలాంటి వాడిని రామయ్య అని పిలవటం కూడా పాపమే' అని

శాపనార్థాలు పెట్టి వెళ్ళిపోయారు. ఇక ఈ ఊళ్ళో ఉండలేక వాళ్ళందరూ రాజు వాళ్ళ మామయ్య ఊరుకే వెళ్ళిపోదామని బయలుదేరారు. ఊరిపొలిమేరలు దాటుతూండగానే సత్యం మామయ్య హార్ట్ ఎటాక్ వచ్చి చనిపోయారు.

ఇప్పుడు.. ఇన్నేళ్ళ తరువాత అగ్రికల్చరల్ ఎమ్.ఎస్సీ చదివినా, ఈ ఊరు మీద మమకారంతో ఇక్కడే వ్యవసాయం చేస్తానని రాజు అత్తయ్యను తీసుకుని వచ్చేశాడు. గొడవలకు కారణం ఇదేనని నేను విన్న కబుర్ల బట్టి అనుకుంటున్నాను.."

కాసేపటి తర్వాత సుందరి నవ్వుతూ ఇంకో సంగతి చెప్పింది. "మీ నాన్న, సత్యం మామయ్య అప్పట్లో బాగా స్నేహంగా ఉండేవాళ్ళుగా. సత్యం మామయ్య వాళ్ళ నాన్న పేరును సోమరాజుగా కొడుక్కి నామకరణం చేస్తుంటే... మీ నాన్న అభ్యంతరం చెప్పారట. 'నాకు కూతురు పుడితే వీడే నా అల్లుడవుతాడు. ఈ పాతకాలపు పేరు పనికిరాదంటూ సమీర్ రాజు అని మార్చి పెట్టించారట. నువ్వు పుట్టకముందు ఒకరికి, పుట్టాక ఇంకొకరికి వాగ్దానం అయిపోయావని ఎవరో సరదాగా చెప్పుకుంటుంటే విన్నాను.." అంది సుందరి.

సుందరి మాటలు విన్నాక అరుంధతి అత్తయ్య వాళ్ళింటికి వెళ్ళి రావాలనే అనిపించింది. "మీ నాన్నకి తెలిస్తే గొడవవుతుంది.. వద్దు" అంది. "ఎప్పుడో జరిగిన గొడవకి ఇప్పుడు.. రాజు, అత్తయ్యలపై నాన్నకెందుకింకా కోపం?" నాకు సందేహం వచ్చింది.

"ఎందుకంటే.. రాజు వచ్చే వరకూ మీ నాన్నే ఊరికి పెద్ద. తన మాటకి తిరుగులేదు. ఇప్పుడందరూ రాజు వెంట పడుతున్నారు. రాజు నిజంగా ఊరికి నాయకుడైపోయాడనుకో! కొంతమంది పెద్దల్ని, కొందరు కుర్రాళ్ళనీ కలిపి ఒక సంఘం ఏర్పాటు చేశాడు. పొలం గట్ల దగ్గర వచ్చే తగాదాల దగ్గర్నుండి ఏ రకమైన సమస్యలు వచ్చినా కోట్లాటలకు దిగకుండా, కోర్టులకెక్కకుండా సంఘం ద్వారానే పరిష్కరించుకోవాలనే నియమానికి ఊరి వాళ్ళందర్నీ ఒప్పించాడు! చిన్నరైతులు పొదుపు చేసుకోవటానికి, ఋణాలు తీసుకోవటానికి సహకార బ్యాంకు, లైబ్రేరీ కూడా ఏర్పాటయ్యాయి. రాజు వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే కుర్రాళ్ళల్లో ఎంత ఉత్సాహం వచ్చిందనుకున్నావ్...! రచ్చబండ దగ్గిర నాటకాలు.. పాటలు.. ఎన్ని ప్రొగ్రాములో! అన్నింటికి రాజే నాయకుడు. సొంతంగా రాజే అన్ని రాస్తాడు తెలుసా..?"

సుందరి ఉత్సాహంగా చెప్పుకుపోతుంటే.. ఆశ్చర్యంగా విన్నాను.

సుందరి వాళ్ళింటి పక్క ప్రహరీ గోడకున్న గుమ్మం నుండి రాజు వాళ్ళింటికి వెళ్ళేసరికి వెనుక వరండాలో పడుకుని ఉన్న అరుంధతి అత్తయ్య లేచి ఎదురు వచ్చింది. ఆప్యాయంగా నా చెంపలు నిమురుతూ, "చూడడానికి రెండు కళ్ళూ చాలవన్నట్లుగా చిన్నప్పుడు ఎలా ఉండేదానివో ఇప్పుడూ అలాగే ఉన్నావ్..!" అంది. అప్పుడే లోపలి నుంచి వచ్చిన రాజు "అయితే నా కళ్ళు కూడా అరువు తీసుకుని చూడమ్మా.." అన్నాడు చిరునవ్వుతో.

"అయినా కూడా సరిపోవురా.." అత్తయ్య అనేసరికి అందరం సరదాగా నవ్వుకున్నాం.

అత్తయ్య, రాజు చిన్నప్పటి సంగతులు ఏవేవో గుర్తు చేస్తూ మాట్లాడుతోంటే నేను విస్మయంగా వింటూ ఉండిపోయాను. నాకు ఆ సంగతులేవీ గుర్తు లేవు. అత్తయ్య తన ఒడిలో కూర్చోబెట్టుకుని ఏవో తినిపించటం... ఇంటి ముందు పిల్లలతో ఆడుకోవటం.. ఇవే లీలగా గుర్తున్నాయి.

అత్తయ్య ఏదో తెస్తానంటూ లోపలకు వెళ్ళింది.

నేను మెల్లగా నసుగుతున్నట్లుగా రాజుతో "మా నాన్న చేసిన అన్యాయం వల్లనే సొంత భూమి అంటూ లేక ఇలా కౌలుకు చేయాల్సిన పరిస్థితి వచ్చినందుకు.. నాన్న మీద కోపంగా ఉంది కదూ?" అన్నాను.

లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపాడు. "అప్పుల వాళ్ళ దగ్గర్నుండి కొంతయినా దక్కించుకుందామని మా నాన్న తెలివితేటలు చూపించాడు. అంతకన్నా తెలివిగా మీ నాన్న ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు. సరిపోయిందిగా..! దీనికి కోపతాపాలు ఎందుకూ..? అమ్మ కూడా మునుపటిలా రెండు కుటుంబాల మధ్య స్నేహమూ, రాకపోకలూ ఉంటేనే బావుంటుందని అనుకుంటోంది!"

"నువ్విలా ఎవరి పొలాలనో కౌలుకి చేయటం.. నాకు బాధగా ఉంది!" అన్నాను.

రాజు చిన్నగా నవ్వాడు. కొంచెంగా నా దగ్గరికి ఒంగి "నీకో విషయం చెప్పనా.. మాకు హైద్రాబాద్‌లో ఉన్న రెండు ఇళ్ళ మీద వచ్చే అద్దెలతో దర్జాగా జరిగిపోతుంది! కాకపోతే సొంత ఊరు మీద మమకారంతో వచ్చానిక్కడకు.. అంతే..!" అన్నాడు.

హైద్రాబాద్‌లో రెండు ఇళ్ళు అంటే... ఫరవాలేదు బాగానే ఉంది అనుకుంటూ "నిజమా?" అన్నాను. "నాలుగేళ్ళ క్రితం ద్రాక్ష తోటల మీద వచ్చిన ఆదాయంతో కొన్నాను.." అనేసరికి నాకింకా ఆశ్చర్యం కలిగింది.

"ద్రాక్ష తోటలు ఉన్నాయా..?" కళ్ళు పెద్దవి చేసి చూస్తూ అన్నాను.

చదువుకుంటూనే ఏం వ్యాపారాలు చేసి ఎలా సంపాదించాడు..? వాళ్ళ మామయ్యల తోడ్పాటు అయి ఉంటుందనిపించింది.

"ఉన్నాయి. కడపలో ఉన్న సినిమా హాలు మీద వచ్చే ఆదాయాన్ని సెపరేట్‌గా ఉంచి దాంతో కొన్నాను!" కూల్‌గా చెప్పాడు.

నా ఆశ్చర్యం రెట్టింపయింది! "సినిమా హాలు కూడా ఉందా..?!" మరిదేమిటి.. ఇన్ని ఆస్తులు పెట్టుకుని.. ఇలా..."

రాజు నిట్టూర్చాడు. "చెప్పానుగా... సొంత ఊరు మీదుండే మమకారం అలాంటిది! చూస్తూండు... సంవత్సరం తిరిగేసరికల్లా ఈ ఊళ్ళో ఉన్న భూముల్లో సగం నేనే కొనేస్తాను!" ధీమాగా అన్నాడు.

ఈ విషయాలేవీ రాజు ఊళ్ళో ఎవరికీ చెప్పలేదనుకుంటా.. అందుకే సుందరికి తెలిసి ఉండదు. ఇంతలో అత్తయ్య... అప్పుడే నెయ్యితో కలిపి చేసింది కాబోలు.. సున్నుండల్నీ, ఒక ప్లేటులో రెండు దోర జామకాయల్నీ, చాకునీ తెచ్చి అక్కడ పెట్టింది.

ఒక సున్నుండని తీసుకుని తింటూ "నీకు నిరాడంబరంగా ఉండటం ఇష్టమైతే అవ్వొచ్చు గానీ... ఇల్లు కొంచెం బాగు చేయించటం, అత్తయ్యకు బంగారం కొనటం... ముఖ్యమేగా... ఇన్ని ఆస్తులుండి కూడా..." రాజుతో నేను అంటోంటే.. అత్తయ్య "ఆస్తులేమిటమ్మా?" అనడిగింది.

లిస్టు చెప్పాను.. ఇళ్ళు, ద్రాక్షతోటలూ, సినిమా హాలూ అంటూ.

"అలా చెప్పావా..?" అంది అత్తయ్య రాజు వేపు చూస్తూ.

రాజు ఫక్కున నవ్వేశాడు. "అవన్నీ ఎక్కడో అక్కడ ఉన్న మాట నిజమేగా... కాకపోతే నావి కావటానికి కొంచెం టైము పడుతుంది! నాకేం తొందరలేదు. అవన్నీ ఉన్నాకూడా... నేనిలాగే కష్టపడుతూ ఉంటాను. అసలు ఈ ప్రపంచంలో ఉన్నవన్నీ నావే అనుకుంటాను! ప్రత్యేకంగా నాకే కావాలి అన్న తపన దేనిమీదా లేదు! ఉంటే

మాత్రం ..ఎంతైనా కష్టపడి సాధిస్తాను! ఈ ఊళ్ళో ఉన్న పొలాలన్నీ నావే... నేనే అందరికీ కౌలుకిచ్చానని అనుకుంటూ ఉంటాను...” అంటూ మళ్ళీ నవ్వాడు.

నాకూ నవ్వొచ్చింది.

అత్తయ్య చిరునవ్వుతో “ఏమీ లేదనే దిగులు వీడికుండదు. నవ్వుతూ బ్రతికేస్తాడు! చదువుంది.. కష్టపడగలిగే వయసుంది. అందుకే నేనూ ధైర్యంగా ఉండగలుగుతున్నాను!” అంది.

అత్తయ్య మళ్ళీ మా చిన్నప్పటి రోజుల్లోకి వెళ్ళిపోయింది. అప్పట్లో అందరూ ఎంత సఖ్యంగా, ఆనందంగా ఉండేవాళ్ళమో అంటూ ఏదో చెబుతోంది.

అత్తయ్య తెచ్చిన చాకుతో జామకాయ కోయబోయాను.

ఓణి చెంగును గట్టిగా చుట్టి “అబ్బా..” అన్నాను. “తెగిందా..?” ఇద్దరూ ఒక్కసారే ఆదుర్దాగా అన్నారు.

“బాగా తెగిందా... అంత బాధగా మొహం పెట్టావ్?” రాజు ఆరా తీశాడు. “రాయటానికి మందు..ఏదైనా ఉందా?” అత్తయ్య రాజుని అడిగింది.

చెంగును అరచేయి అంతటికి కూడా బాగా చుట్టేస్తూ “నాకు చిన్నగాయమైనా సరే.. రక్తం ఆగదు.. సిజోనియా... అని ఏదో పేరు చెప్పారు... ఈ జబ్బు లక్షమందిలో ఒక్కరికే వచ్చే అవకాశం ఉందట... రోజూ టాబ్లెట్ వేసుకోవాలి... రెండు రోజులుగా వేసుకోలేదు. అందుకే కంగారుగా ఉంది...” బొంగురు గొంతుతో చెప్పాను.

“అంత ప్రమాదకరమా..?” అత్తయ్య గాబరాగా అంటే “ఆ జబ్బు పేరు.. ఎప్పుడూ వినలేదే?” అని రాజు అన్నాడు.

“లక్షమందిలో ఒకరికి వచ్చే రోగం పేరు అందరికీ తెలుస్తుందా..? ఆ మధ్య లంగ్ ఇన్‌ఫెక్షన్ వచ్చినప్పుడు చేసిన టెస్టుల్లో ఇది బయటపడింది. ఎన్నాళ్ళు బ్రతుకుతారో కూడా చెప్పటం కష్టమే అన్నారు...” తల వంచుకుని మెల్లగా అన్నాను.

నేను తల ఎత్తి చూసేసరికి ఇద్దరి కన్నులోనూ నీటిపొర...!

నేను విస్మయంగా చూస్తూంటే... రాజు నా రెండు భుజాలూ పట్టుకుని గట్టిగా ఊపేస్తూ “ఎందుకు ఇలాంటి అబద్ధాలు చెబుతున్నావ్...?” అన్నాడు.

“ఇంత చిన్నపిల్లవు నీకీ జబ్బులేమిటమ్మా...?” అత్తయ్య కళ్ళల్లో చేరిన నీరు చెంపల మీదుగా జారింది.

రాజు వేపు చూస్తూ "అబద్ధం ఏముందీ.. మరణం మనల్ని వెన్నంటే ఉంటుందనీ, ఎప్పుడు కబళిస్తుందో తెలియదనే మాట నిజమేగా..! నీకైనా అంతేగా.. అదే అన్నాను. ఇప్పుడో, ఎప్పుడో.. ఎన్నేళ్ళ తర్వాతనో...! ఏదో నోటికి వచ్చిన పేరు చెప్పాను గానీ.. అలాంటి జబ్బేమీ లేదు... అసలు నా వేలు కొంచెం కూడా తెగలేదు..." అని చేతికి చుట్టిన చెంగు విప్పేసాను. "లేకపోతే అల్లరి చేయటానికీ, ఆట పట్టించడానికీ నీకే కాపీరైటు ఉందనుకున్నావా.. భలే నమ్మేశావు గదూ?" అంటూ పెద్దగా నవ్వాను.

"నేను నమ్మలేదు.." నిట్టూర్చాడు.

"అబద్ధాలు చెప్పకు.. నీ కళ్ళల్లో నీళ్ళు చూడలేదనుకున్నావా?" మళ్ళీ నవ్వాను.

"పరిహాసానికైనా సరే.. తట్టుకోలేక.." తల అటు పక్కకి తిప్పుకున్నాడు.

అత్తయ్య నా చేతులు పట్టుకొని "తప్పమ్మా.. సరదాకైనా అలాంటి మాటలనకూడదు. పెద్దవాళ్ళం విని తట్టుకోలేం!" అంది.

నేను నవ్వినా గానీ వాళ్ళిద్దరూ సీరియస్‌గానే ఉన్నారు.

నేను తమాషాగా అన్న మాటలకే వాళ్ళిద్దరూ అంతలా కదిలిపోవటం నన్ను విస్మయ పరిచింది.

వాళ్ళిద్దరూ ఇంకా ఆ మూడ్‌లోనే ఉండేసరికి మాట మారుస్తూ "అయితే రాజూ... నీకేదైనా కావాలని అనుకుంటే తప్పకుండా సాధిస్తావన్నమాట! నీ మీద నీకు అంత నమ్మకమా..?" అడిగాను.

"అవును.. 'కృషితో నాస్తి దుర్భిక్షమ్' అని చెప్పే పెద్దల్ని నమ్ముతాను!" చిరునవ్వుతో అన్నాడు.

అత్తయ్యకు వెళ్ళొస్తానని చెప్పి గుమ్మం దగ్గరకు వచ్చాక... అప్పుడు గుర్తుకు వచ్చి.. నా వెనకే వస్తున్న రాజును "నిన్న.. చిన్నప్పటి శ్రీరామచంద్రుడిని... అని ఏదో చెప్పావ్.. ఏమిటి?" అనడిగాను.

రాజు పెదవుల పైకి చిరునవ్వు వచ్చింది. "అది.. అది.." అని నసుగుతుంటే "అదొక గతకాలపు కథ.. మనకనవసరం.. మర్చిపోవటం మంచిది.. అని మాత్రం చెప్పకు.." అన్నాను నిన్నటి రాజు మాటల్ని గుర్తు తెచ్చుకుని అనుకరిస్తూ.

"ఉహూ.. అలా చెప్పను.. ఎందుకంటే... నిజంగా అది... నేను మనసులో మళ్ళీ మళ్ళీ స్మరించుకునేంత కమనీయమైన కథ కాబట్టి!"

"నిజంగానా.. అయితే చెప్పు..." అన్నాను.

"ఇప్పుడు కాదు.. నువ్వు మళ్ళీ వచ్చినప్పుడు.." అన్నాడు.

"నేను.. మళ్ళీనా..?!" అప్రయత్నంగా అన్నాను.

చాలా సంవత్సరాలైందని... నాన్నకి ఇష్టం లేదని తెలిసినా... ఇప్పుడు వచ్చాను గానీ మళ్లీ ఎలా రాగలను.. అనుకున్నాను.

నా సంశయం గమనించి కాబోలు... రాజు అన్నాడు. "సరే... నీ ఇష్టం.. ఆ కథ వినాలని ఉంటేనే రా!" ఒక నిముషం ఆగి నేను బయటకు అడుగు వేస్తోంటే.. "నిజంగానే అది ఒక కమనీయమైన కథ!" అంటూ నవ్వాడు.

తమాషా చేస్తున్నాడనుకుంటూ నేనూ నవ్వుకుంటూ వచ్చేశాను.

# 18

ఆ తర్వాత అమ్మని మాటల మధ్య అడిగాను. "ఊళ్ళో వాళ్ళు అనుకునే మాటలు నిజమేనా? నాన్న సత్యం మామయ్య రాసిన భూమిని తిరిగి ఇవ్వలేదటగా..?"

"ఏదో అప్పుడు అలా జరిగిపోయింది. అరుంధతి అన్నయ్యలు కూడా తక్కువ వాళ్ళు కాదు. చాలా గొడవ చేసారు. ఎన్ని శాపనార్థాలు పెట్టారో..! ఊళ్ళో వాళ్ళు కూడా వాళ్ళ పక్షమే అన్నట్లుగా అప్పటి నుండేగా మీ నాన్నని రామయ్య అన్న మాట లేకుండా పిలుస్తున్నారు..!" అంటూ నిట్టూర్చింది.

రాజు వాళ్లకి నాన్న వలన అన్యాయం జరిగిందన్నది నిజమేనని అమ్మ కూడా అంగీకరించినట్లుగా మాట్లాడడంతో.. నాకు రాజు పట్ల సానుభూతి పెరిగిపోయింది. అందుకనో... రాజు చెబుతానన్న శ్రీరామచంద్రుడి కథేమిటో తెలుసుకోవాలన్న ఉత్సుకతో... చెప్పలేను గానీ మొత్తానికి అత్తయ్య వాళ్ళింటికి మళ్ళీ వెళ్ళకుండా ఉండలేకపోయాను.

నేను వెళ్ళినపుడు రాజు మొహంలో ఆనందం కొట్టొచ్చినట్లుగా కనిపించింది! అత్తయ్య గదిలో నిద్రపోతోంది.

రాజు గదిలో కాగితాల కట్టల్నీ... పుస్తకాల దొంతరల్నీ పరిశీలనగా చూస్తూ టేబుల్ ముందున్న కుర్చీలో కూర్చున్నాను. "ఇపుడు చెప్పు... శ్రీరామచంద్రుడి కథేమిటో..." అన్నాను.

"నిజంగా రామకథ చాలా గొప్పది... నిన్ను మళ్ళీ రప్పించింది!" సంతోషంగా అన్నాడు. ఒక నిముషం కళ్ళు మూసుకొని తెరిచాడు. మనసు తెరపై ఏ అపురూప దృశ్యం కదలాడిందో గానీ రాజు మొహం తళతళలాడింది!

అప్పుడు రాజు చెప్పిన కథేమిటో తెలుసా బావా...?

చెన్నూరులో.. మన చిన్నప్పుడు శ్రీరామనవమి రోజుల్లో రామాలయం ముందు కోటయ్య మాష్టారు మనందరితో వేయించిన చిన్న నాటకం సంగతి! సీతాకళ్యాణం అట! నాకైతే ఏమీ గుర్తు లేదు.

నేను సీత.. నువ్వు రాముడు... రాజు రావణాసురుడు. ముఖ్యమైన పాత్రలు ఇవి. అరుంధతి అత్తయ్య తన పట్టుచీరెను సగానికి కత్తిరించి... నాకు చీరగా కట్టి.. సీతగా అలంకరించి... తనే నన్ను ఎత్తుకుని వచ్చి బెంచీలతో తయారు చేసిన స్టేజి మీద నిలబెట్టిందట. రాముడి వేషంలో నువ్వొక చివర ఉంటే... రాజు రావణాసురుడిలా స్టేజి మధ్యకు వచ్చాడు. పూలదండ పట్టుకొని నిలబడ్డ నా ఎదురుగానున్న మాష్టారు తయారు చేసిన ధనస్సును విరవలేనట్లుగా రాజు నటిస్తే... తరువాత నువ్వు వచ్చి విరవాలి. కానీ రాజు ధనస్సును విరిచేశాడట! నేనేమో తెలియక రాజు మెడలో దండ వేస్తే ..మాష్టారు వచ్చి ఇదేంటని గోలపెట్టి దండ తీసేయమంటే... రాజు తీయనంటూ మొండికేశాడట! "నేను విరవలేకపోతేనేగా, విష్ణు విరిచెయ్యాలి. నేను విరిచాను కాబట్టి నాకే దండ వేయాలి.. నేనే శ్రీరామచంద్రుడిని.. విష్ణు..కాదు.." అని గొడవ చేస్తుంటే మాష్టారు తలపట్టుకున్నారట! చిన్నపిల్లలంతా చప్పట్లు... చూడటానికి వచ్చి కూర్చున్న పెద్దలంతా నవ్వులు!

నేను కూడా మాష్టారితో "రాజు దండ కావాలంటున్నాడుగా, ఇచ్చేయ్యండి మాష్టారూ..." అని ముద్దు మాటలతో చెప్పేసరికి ఏంచేయాలో తోచక ఇక అక్కడితో ముగించేశారట! రాజు "నేనే శ్రీరామచంద్రుడిని.." అంటూ గెంతులు వేశాడట!

నేను తన మెడలో దండ వేసిన దృశ్యం ఎప్పటికీ చెరగని విధంగా తన మనసులో ముద్రించుకుపోయిందనీ... ఆ సంఘటన స్మరించుకోవటం అప్పటి నుండీ తనకిష్టమైన వ్యాపకంగా మారిందని రాజు చెబుతోంటే.. కొంచెం ఇబ్బందిగా అనిపించింది.

అంతలోనే రాజు డ్రాయరు సొరుగు లాగి కొన్ని కాగితాల్ని నా చేతికి ఇచ్చి, "నాకు కొంచెం కొంచెంగా బొమ్మలు వేయటం వచ్చిందగ్గర్నుండీ... నా చిన్నారి నేస్తం

ఇప్పుడెలా ఉండి ఉంటుందో.. ఎంత పొడుగై ఉంటుందో.. అని ఊహిస్తూ అప్పుడప్పుడు వేసినవి..” అన్నాడు.

నాపోలికలు లేకపోయినా గానీ వయసు తారతమ్యాన్ని చూపిస్తూ రకరకాల భంగిమల్లో ఉన్న ఆ రేఖాచిత్రాల్ని చూస్తూ నిర్విణ్ణురాలినైపోయాను.

కొన్ని బొమ్మల క్రిందో, వెనుకో చిన్నచిన్న కవితలు రాసి ఉన్నాయి.

ఒకదాని క్రింద రాసి ఉన్న చిన్న కవిత మాత్రం నాకు బాగా గుర్తుండిపోయింది.

నాలోని అణువణువూ ఓ వేణువుగా మారగా
నిరంతరం నీ నామ గానమే చేయనా..
కనురెప్పల కుంచెలతో కంటి పాప తెరపై
నీ రూపమే గీయనా..
ప్రేమ నిండిన నా మనసే కోహినూర్
కానుకగా నీకే ఈయనా..

“ఇది రెండు రోజుల క్రితం వేసినది” అంటూ ఓ కాగితం ఇచ్చాడు.

గడ్డిమేటుకు ఏటవాలుగా ఆనించి ఉన్న నిచ్చెనపై పడుకుని ఆకాశం వేపు చూస్తూ గడ్డిపరకను కొరుకుతున్నట్లుగా ఉన్న ఆ బొమ్మలో నా పోలికలు బాగానే వచ్చాయి. ముగ్ధురాలినైపోయాను. రాజు మురళీ కూడా బాగా వాయిస్తాడని సుందరి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

ప్రశంసగా చూస్తూ “అమ్మో... నీకు ఇన్ని కళల్లో ప్రవేశం ఉందా..? కవిత్వం, చిత్రలేఖనం, సంగీతం..!” అన్నాను.

రాజు నిట్టూర్చాడు. “అన్నింటిలోనూ చేయి పెట్టానే గానీ.. దేనిలోనూ చేయి తిరగలేదు. ప్రవేశమే గానీ నిజం చెప్పాలంటే ప్రావీణ్యం లేదు! నేను రాసేవన్నీ అల్లీబిల్లీ పదాలే... గొప్ప కవిత్వం ఉండదు. ఈ గీతలనయినా చూడు... నీ అందంలోని నూరోవంతునయినా పట్టుకోలేక పోయాయి! ఎప్పటికైనా నీ రూపానికి పూర్తి న్యాయం జరిగేలా బొమ్మ గీయగలిగితే.. అప్పుడు నేనూ ఓ ఆర్టిస్టునేనని సంతోషించొచ్చు.!”

రాజు ఓ అద్భుతంలా అనిపించాడు! వ్యవసాయం చేసుకుంటూ..ఊళ్ళోవాళ్ళకి సలహాలూ, సూచనలే కాకుండా అవసరమైన వాళ్ళకి సాయం కూడా చేస్తూ.. ఆపైన బొమ్మలు వేయటం.. రాయటం.. ఇన్ని చేయగలుగుతున్నాడా..?!

ఉరకలు వేసే ఉత్సాహం ఉంటే... ఎన్నైనా చేయగలుగుతారేమో!

అత్తయ్య లేచింది కాబోలు... నన్ను చూసి ప్లేటు నిండా వెన్న ఉండలు పెట్టుకుని వచ్చింది.

“నువ్వసలే నీరసంగా కనిపిస్తున్నావు.. ఇలాంటి పనులు కూడా ఎందుకత్తయ్యా..?” మొహమాటంగా అన్నాను.

“ఇదేమంత పెద్దపని కాదమ్మా... ఇన్నేళ్ళ తర్వాత కనిపించావు... వీటిని బట్టే తనని గుర్తుపట్టావని రాజు అన్నాడు...'' చిరునవ్వుతో అంది. “ఇష్టమైన వాళ్ళ కోసం కష్టమైనా సరే చేయగలగటమే ఇష్టంగా ఉంటుంది అవునా..?”

నేను ప్లేటును రాజుకు అందివ్వబోతే “నువ్వు ఇష్టంగా తినటం... చూడటమే నాకిష్టం...” అంటూ నవ్వేశాడు.

ఎవరో రాజు కోసం వస్తే... వాళ్ళ పొలం దగ్గరకు వెళ్ళాలని రాజు అత్తయ్యకు, నాకు చెప్పి వాళ్ళతో వెళ్లిపోయాడు.

అత్తయ్య నా దగ్గిర కూర్చొని.. మనింట్లో అందరి గురించీ పేరు పేరునా అడిగింది. నా చేయి పట్టుకుని ఆప్యాయంగా చూస్తూ “నువ్వు వాళ్ళింటి కోడలివి అవుతున్నావు. చాలా అదృష్టవంతురాలివి. కోటీశ్వరులని అనటం లేదు. వాళ్ళందరూ మంచి మనుషులు. నిన్నెంతో అపురూపంగా చూసుకుంటారని విన్నాను..” అంది.

ఇతరులలోని మంచిని గుర్తించటానికి కూడా మంచి మనసు ఉండాలి! అత్తయ్యది నిర్మలమైన మంచి మనసు అనుకున్నాను. కాసేపు కూర్చుని ఇంటికి వచ్చేశాను.

మర్నాడే అత్తమ్మ ఫోను చేసి నన్ను రమ్మని చెప్పి కారు పంపిస్తున్నాను అంది.

కారులో అమ్మ కూరగాయలూ.. అవీ.. సర్దిస్తోంది.

ఇంటి వెనుక వేపు నుంచి ఎవరో ఫ్లూటు వాయిస్తున్నట్లుగా అనిపిస్తే... ఒక క్షణం దీక్షగా విన్నాను. నాకు ఏదో ఆలోచన వచ్చి పెరటి గుమ్మం తలుపు తీసుకొని బయటకు వచ్చాను. సన్నటి దారి దాటితే రాయుడుగారి తోట ఉంటుందిగా, అటు నాలుగడుగులు వేసి చెట్టు క్రింది నిలబడి అటూ ఇటూ చూస్తుంటే దబ్బుమన్న శబ్దానికి ఉలిక్కిపడ్డాను.

చెట్టు మీద నుండి రాజు దూకాడు. చేతిలో పిల్లనగ్రోవి ఉంది.

నా ఆలోచన కరెక్టే అయింది!

రాజు వేపు చిరుకోపంతో చూస్తూ "అంత దూకుడు పనికిరాదు!" అన్నాను.

"ఈ వయసులో నిదానమూ కుదరదులే.." అంటూ నవ్వాడు.

"ఏమిటీ ... చెట్టెక్కి రాగాలాపన మొదలుపెట్టావ్..? ఊళ్ళోని అమ్మాయిలందరూ గోపికల్లా వచ్చేస్తారనుకున్నావా..?" వేళాకోళంగా అన్నాను.

"అందరూ ఎందుకులే.. నువ్వొచ్చావుగా, చాలు!" అల్లరిగా నవ్వాడు.

కొంచెం బిడియంగా అనిపించింది.. గోపికల ప్రస్తావన చేయకుండా ఉండాల్సిందని అనుకున్నాను.

"అవునూ..నువ్వేమిటి.. ఇక్కడ ఉన్నావ్?" మాట మారుస్తూ అడిగాను.

"ఇప్పుడు.. ఈ తోటకి.. నేనే... సొంత.." అంటూ ఒక క్షణం ఆగి "కౌలుదారునన్నమాట!" అంటూ నవ్వాడు. "మొన్నా మధ్య రాయుడుగారు నన్ను ఈ తోటని తీసుకోమంటే.. చేయటం కష్టమౌతుందని వద్దన్నాను. ఇప్పుడు మనసు మార్చుకుని తీసుకుంటానని నిన్న సాయంకాలమే చెప్పాను.."

"ఎందుకలా హఠాత్తుగా మనసు మార్చుకున్నావ్?"

"నువ్వే.. చెప్పావుగా.."

"నేనా....?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును.. అమ్మ నలుగురిలో మునుపటిలా హుందాగా ఉండాలి.. బంగారం కొనాలి.. ఇల్లు బాగుచేయించాలి.. ఇవి నా ప్రథమ కర్తవ్యాలని తమరే గుర్తు చేశారు..." అంటూ నవ్వాడు.

"అందుకే ఇంకొంచెం కష్టపడదామని నిర్ణయించుకొన్నాను.. ఆపైన ఇంకొక కారణమూ ఉందిలే.." అన్నాడు.

"ఏమిటో అది..?"

"అది.. ఇప్పుడు కాదు.. మళ్ళీ కలిసినప్పుడు చెబుతాలే.."

"బావుంది ..ఏదీ వెంటనే చెప్పవా? వాయిదా లెయ్యటం అలవాటనుకుంటాను. ప్రేమించిన అమ్మాయితోనైనా పెళ్ళికి వెంటనే ఒప్పుకుంటావా.. లేక వచ్చే జన్మలో అంటూ వాయిదా వేస్తావా..?" సరదాగా అన్నాను.

"అలా శపించకు తల్లీ! మరోసారి కలుసుకోవాలనే కోరికను తెలియజేయటానికే అలా అన్నాను! ఇంకొక కారణం ఏమిటంటే.. ఈ తోట మీ ఇంటి వెనకేగా.. ఎప్పుడైనా నిన్ను పిలవాలనుకుంటే, ఇదిగో ఇలా వీలవుతుంది కదాని...!" మురళిని నా కళ్ళ ముందు తిప్పాడు...

"ఇక ఇప్పుడైనా ప్రేమా, పెళ్ళి కూడా ఈ జన్మలోనే అని అనుగ్రహించు..!"

"అనుగ్రహించడానికి నేనేమైనా దేవతనా...?" నవ్వాను.

"నాకు మాత్రం అలాగే కనిపిస్తావు! మంచి మనసున్న కొందరికి వాక్సుద్ధి ఉంటుందట! వాళ్లు అన్నది జరుగుతుంది! అందుకని...నువ్వు ఎప్పుడూ మంచి జరగటం గురించే మాట్లాడు తెలిసిందా?" అన్నాడు.

"సరేలే... తెలిసింది.. అవతల అమ్మ నాకోసం చూస్తూ ఉంటుంది..." అంటూ పరిగెత్తుకు వచ్చేశాను.

కారులో కూర్చున్న నేను ఊరుకు దూరంగా ముందుకు వెళ్తోంటే.. నామనసు మాత్రం వెనక్కి పరుగులు తీస్తోంది. ఆ మురళీగానం గాలి అలలపై తేలుతూ వచ్చి... మనసును తాకుతూ పులకింతల్ని రేపుతున్నట్లుగా తీయని అనుభూతి!

ఇంటికి వచ్చాక కూడా... ఒంటరిగా ఉన్నా, నలుగురితో మాట్లాడుతున్నా.. అదేమిటో ఎప్పుడూ మనసులో రాజు ఆలోచనల ముట్టడే..! రాజు రూపం కళ్ళ ముందు నుండి కదలనంటూ మొండికేస్తోంది!

ఇది తప్పు... కూడదు.. నేను విష్ణు బావకు కాబోయే భార్యని... ఇలా నన్ను నేనే మందలించుకునేదాన్ని! కానీ ఏం లాభం లేకపోయేది! మనసుకు గట్టిగా గడియ వేసెయ్యాలని ప్రయత్నించే కొద్దీ.. తలుపుల్ని బద్దలు కొట్టే ఝంఝా మారుతంలారాజు తలపులు జొరబడి పోతుంటే.. ఏమీ చేయలేని నిస్సహాయురాలినైపోయాను.

మునుపు చెన్నూరు వెళ్ళాలంటే... బద్ధకించేదాన్ని. ఇప్పుడు ఏ చిన్న కారణం కనుపించినా వెళ్ళి రావాలని మనసు ఉవ్విళ్ళూరుతోంది..! దాంతో రాక పోకలు పెరిగాయి.